నా ఇల్లు ఇప్పించండి.. జెసికి వినతి

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న షాహిదా

ప్రజాశక్తి-రాయచోటి

సుండుపల్లి మండలానికి చెందిన షాహిదా అనే విభిన్నప్రతిభావంతురాలు ఇంటిని హబీబ్ అనే వ్యక్తి అద్దెకి తీసుకొని రిజిస్టర్ చేయించుకొన్నారని శుక్రవారం జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఆమె కలెక్టర్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన ఇంట్లో అద్దెకు ఉంటున్న హబీబ్ అనే వ్యాపారస్తుడు ఇంటిని రిజిస్టర్ చేయించుకుని తనను బయటకు గెట్టేసారని వాపోయింది. ఈ విషయంపై చాలా రోజుల నుంచి రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా ఉపయోగం లేకపోవడంతో కలెక్టర్‌కి మొరపెట్టుకోవాలనే ఉద్దేశంతో ఇక్కడికి వచ్చానని తెలిపారు. ఈ విషయంపై జెసి స్పందిస్తూ ఈ విషయాన్ని పూర్తిస్థాయిలో విచారించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆమెకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆమెతోపాటు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు బండి ఈశ్వర్, జనసేన నాయకులు లక్ష్మీనారాయణ, ఆమె కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టు పనులకు బ్రేక్

రూ.924 కోట్ల బిల్లులు పెండింగ్
ఆరు నెలలుగా పనులు నిలిపివేత
చేతులెత్తేసిన ఇరిగేషన్ ఇంజినీర్లు

ఉమ్మడి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టు పనులకు గ్రహణం పట్టింది. జిల్లా సాగునీటి పారుదల శాఖలో భారీగా పేరుకుపోయిన పెండింగ్ బిల్లుల చెల్లింపులే పనుల నిలుపుదలకు కారణమనే వాదన వినిపిస్తోంది. వైసిపి ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని జిఎన్ఎస్ఎస్ ఫేజ్-1, ఫేజ్-2, సాగునీటి ప్రాజెక్టులు, కాల్వల ఆధునికీకరణకు సుమారు రూ.12 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలుస్తోంది. జిఎన్ఎస్ఎస్ ఆధునికీకరణ, నూతన రిజర్వాయర్ల నిర్మాణం, తెగిన రిజర్వాయర్ల పునరుద్ధరణ, పలుఎత్తిపోతల పనులు, ఎల్ఎ, ఆర్అండ్ఆర్ పనులకు సంబంధించి సుమారు రూ.924 కోట్లు మేరకు అభివృద్ధి పనులు చేపట్టారు. ఏడాది కిందట రూ.139 కోట్ల చెల్లింపులు చేయడం మినహా మిగిలిన బిల్లులు చేయకపోవడం గమనార్హం.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి జిల్లా పరిధిలోని జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2లోని ప్యాకేజ్-1 కింద నాలుగేళ్ల కిందట రూ.5,030 కోట్లతో కాలేటివాగు ఎత్తిపోతల పథకం పనులు చేపట్టారు. 6.5 టిఎంసిల నిల్వ సామర్థ్యంతో తలపెట్టిన మూడు కొత్త రిజర్వాయర్లలో రెండింటిని పూర్తి చేసినట్లు తెలుస్తోంది. రాయలసీమ కరువు రక్కసిని పారదోలేందుకు ఉద్దేశించి రాయలసీమ డ్రౌట్‌మిటిగేషన్ ప్రాజెక్టు (ఆర్‌డబ్ల్యుఎంపి) మొదలుకుని పలు ప్రాజెక్టుల పనుల్లో ఎటువంటి పురోగతి లేకుండా పోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. 2024 మార్చి, ఏప్రిల్‌లో నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారం చేతులు మారడం సాగునీటి ప్రాజెక్టుల పనులకు శాపంగా మారినట్లు కనిపిస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పనులు చేపట్టిన 15 కాంట్రాక్టు కంపెనీలు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అంచనా ఆధారంగా పనుల్ని నిలిపేయడం ఆందోళన కలిగిస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు, తర్వాత సుమారు నాలుగు నుంచి ఆరు నెలలుగా పనుల్ని నిలిపేయడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పరిస్థితి మారిపోయింది. జిల్లాలో కాంట్రాక్టు పనులు దక్కించుకున్న కంపెనీల్లో ప్రధానంగా మెయిల్, పిఎల్ఆర్-ఎన్ఇసిఎల్, పిఎల్ ప్రాజెక్ట్స్, ఎంఆర్‌కెఆర్, రాఘవ కన్స్ట్రక్షన్స్, విపిఆర్, రిత్విక్, మాక్స్ ఇన్‌ఫ్రా, ఆర్ఆర్ కన్స్ట్రక్షన్స్, కెఎంవి, ఆర్‌విఆర్, ఎస్ఎల్ఆర్ ఇన్‌ఫ్రా, రత్న ఇన్‌ఫ్రా, మైథాస్ ఎన్‌సిసి వంటి కాంట్రాక్టు కంపెనీలు ఉన్నాయి. ఏడు కంపెనీలు ఐదేళ్లుగా తట్టెడు మట్టి ఎత్తిపోసిన దాఖలాలు లేవని వాదన వినిపిస్తోంది. బిల్లుల చెల్లింపులు నిలిచిపోయిన నేపథ్యంలో ఇరిగేషన్ ఇంజినీరింగ్ యంత్రాంగం బడా కాంట్రాక్టు కంపెనీలతో పనులు చేయించలేక చేతులెత్తిసినట్లు తెలుస్తోంది. సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వం స్పందించి పోలవరానికి పరిమితం గాకుండా జిల్లా సాగు నీటి ప్రాజెక్టు పనులను పరుగులు తీయించాల్సిన అవసరం ఎంతైనా ఉందనే వాదన వినిపిస్తోంది.

బిందు సేద్యంపై చిగురిస్తున్న ఆశలు

- పథకాన్ని గాలికొదిలేసిన గత ప్రభుత్వం
- ప్రస్తుత సర్కారు పునరుద్ధరిస్తే ప్రయోజనం

మామిడి తోట

ప్రజాశక్తి-వీరబల్లి

గత ప్రభుత్వంలో ఉద్యాన రంగానికి తలుపులు బిగించారు. బిందు సేద్యం పూర్తిగా నిర్లక్ష్యం చేసి వేరుశనగ, కూరగాయలు, పూలు, పండ్ల తోటలు, సాగు చేసే రైతుల నోట్లో దుమ్ము కొట్టారు. గత ప్రభుత్వాలు అమలు చేసిన పథకాన్ని మొదట మూడున్న రెళ్ల పాటు నిలిపివేసి రైతులకు అన్యాయం చేశారు. ఎన్నికలకు ముందు హడావుడిగా పథకాన్ని పునరుద్ధరించినా రాయితీలకు కట్ చేసి రైతుల ఉసురు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో పథకాన్ని పునరుద్దరిస్తామంటూ చంద్రబాబు ఇచ్చిన హామీతో రైతుల్లో కొత్త ఆశలు చిగురించాయి. టిడిపి కూటమి ప్రభుత్వం కొలువు తీరడంతో వీరబల్లి రైతులు ఈ పథకాన్ని ఎప్పుడు పునరుద్దరిస్తారని ఆశగా ఎదురుచూస్తున్నారు. వారి ఆశలకు తగ్గట్టుగా వీలైనంత త్వరగా కార్యచరణ చేపట్టి మేలు చేసేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

టిడిపి ప్రభుత్వం 2014-19 పది ఎకరాలలోపు ఉన్న రైతులకు 90 శాతం రాయితీతో పరికరాలు అందించింది. ఎస్సీ, ఎస్టీలకు, 100 వాతం

నిల్వచేసిన బిందు సేద్యం పైపులు

రాయితీ కల్పించింది. వైసిపి ప్రభుత్వంలో 5 ఎకరాలు దాటిన రైతులకు 70 శాతం మాత్రమే ఇచ్చారు. జగన్ నా ఎస్సీలు, నా ఎస్టీలు అంటూనే వారికి 100 శాతం రాయితీ ఎత్తేశారు. చాలా మంది పరికరాలకు అవసరమైన డిడిలు కట్టలేక భయపడి దరఖాస్తు చేసుకోలేదు. మళ్లీ టిడిపి అధికారంలోకి రావడంతో 90 శాతం రాయితీ అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను రూపొందిస్తున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నారు.

అప్పట్లో లక్షలాది మందికి ఉపయోగం

బిందు సేద్యం ద్వారా తక్కువ నీటితో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చు. డ్రిప్ పరికరాలు ఏర్పాటు చేసుకోవడం ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. 2014-19 అప్పటి టిడిపి ప్రభుత్వం 90 శాతం రాయితీతో బిందు సేద్యం పరికరాలు అందించింది. మండలాలను ఉద్యాన పంటల హబ్‌గా తీర్చి దిద్దే క్రమంలో మండలాల్లో వందలాది మంది రైతులకు డ్రిప్ పరికరాలు పంపిణీ చేశారు. 2019లో వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత పథకాన్ని ఆటకెక్కించింది. మూడున్నర ఏళ్ల పాటు పట్టించుకోలేదు. ఎన్నికల ముందు అరకొరగా అందించారు. అవి కూడా నాసిరకం పరికరాలతో చాలామంది రైతులు తిరస్కరించారు. రాయచోటి ఎమ్మెల్యే రాంప్రసాద్‌రెడ్డి మంత్రి కావడంతో రైతుల్లో ఆశలు మొదలయ్యాయి. వీలైనంత త్వరగా ప్రక్రియను పూర్తి చేసి పనులు మొదలు పట్టాలని పలువురు రైతులు కోరుకుంటున్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించండి

- రవాణా శాఖ మంత్రి 'మండిపల్లి'కి వినతి

మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

అంగన్వాడీల ప్రధాన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం పట్టణంలోని టిడిపి పార్టీ కార్యాలయంలో రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని రాయచోటి, లక్కిరెడ్డిపల్లి ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శిలు భాగ్యలక్ష్మి, ఓబులమ్మ ఆధ్వర్యంలో అంగన్వాడీలు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్స్, మినీ వర్కర్స్ అనేక సేవలు అందిస్తున్నారని తెలిపారు. అంగన్వాడీలకు పనివారం పెరిగిందని చెప్పారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగలేదన్నారు. వేతనాల పెంపు, గ్రాట్యూటీ అమలు తదితర సమస్యల కోసం గత ప్రభుత్వం ఉన్నప్పుడు 42 రోజుల పాటు తీవ్ర నిర్బంధాన్ని ఎదురుకున్నామని, ఎస్మా లాంటి చట్టాలను ఎదిరించి సుదీర్ఘ సమ్మె చేశామని పేర్కొన్నారు. అనివార్యంగా ప్రభుత్వం కొన్ని జిఒలు ఇచ్చినా ప్రధాన సమస్యలు పరిష్కారం కాలేదని తెలిపారు. గత ప్రభుత్వం జూలైలో వేతనాలు పెంచుతామని మినిట్స్ కాపీ ఇచ్చినా అంగన్వాడీ సమస్యలు పరిస్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని 42 రోజులు సమ్మె ముగింపు సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన మినిట్స్ కాపీలో ఉన్న అన్ని అంశాలు పరిష్కారం చేసి పెండింగ్ జిఒలు ఇవ్వాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి త్వరలోనే అంగన్వాడీ సమస్యలపై శుభవార్త చెబుతామని ఎవరు ఆందోళన చెందాల్సిన పనిలేదని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అంగన్వాడీ రాయచోటి లక్కిరెడ్డిపల్లె ప్రాజెక్టు అధ్యక్షులు సిద్ధమ్మ, సుకుమారి మండల సెక్టార్ నాయకులు, పెద్ద ఎత్తున అంగన్వాడీలు పాల్గొన్నారు.

కబ్జాకు గురైన స్థలాలను గుర్తించాలి : ఎమ్మెల్యే

బికె.పల్లి కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలో కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. రూరల్ మండలంలోని కొండామర్రిపల్లి పంచాయతీ, బికె.పల్లి కాలనీలో ఎమ్మెల్యే శుక్రవారం రెవెన్యూ అధికారులతో కలిసి పర్యటించారు. గత ప్రభుత్వ హయాంలో వైసిపి నాయకులు యథేచ్ఛగా ఇళ్ల స్థలాలను కబ్జా చేశారని లేఅవుట్లు నిర్మించారని ఆరోపణలు రావడంతో ఆయన బికెపల్లి కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా తహాశీల్దార్ రమాదేవి, రెవెన్యూ అధికారులతో మాట్లాడుతూ వెంటనే కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాలను గుర్తించాలన్నారు. అర్హులైన పేదలకు వాటిని కేటాయించేలా రూపకల్పన చేయాలని వారిని ఆదేశించారు. ఎవరైనా సరే చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే సహించే సమస్య లేదని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బికె.పల్లి కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. మురికినీటి కాలువలు ఏర్పాటు చేయాలని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని, వీధిలైట్ల సదుపాయం కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట రెవెన్యూ అధికారులు, సిబ్బంది, కాలనీ ప్రజలు ఉన్నారు.

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

తమ ప్రాంతాల్లోని సమస్యలు పరిష్కరించాలని పలువురు ఎమ్మెల్యేకు వినతులు అందజేశారు. వారి అర్జీలను పరిశీలించిన ఎమ్మెల్యే ఆయా శాఖల అధికారులకు ఫోన్ ద్వారా వారి సమస్యను వివరించి వెంటనే పరిష్కరించాలని తెలిపారు. అనంతరం ఎస్టేట్‌కు చెందిన కొంతమంది మహిళలు ఎమ్మెల్యేను కలిసి తమ కాలనీలో వీధిలైట్లు లేవని, మురుగునటి కాలువలు సక్రమంగా లేవని, నీటి సమస్య ఉందని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే మున్సిపల్ శాఖ అధికారులకు ఫోన్ చేసి ఎస్టేట్‌లోని సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించి వెంటనే ఆ సమస్యను క్లియర్ చేయాలని వారికి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కొత్తపల్లి పంచాయతీ కొత్తిండ్లులో ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులకు నోట్, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. పాఠశాలల అభివృద్ధికి తాను కృషి చేస్తానని తెలిపారు. పిల్లలు బాగా చదువుకొని ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని, పరిష్కరించలేని సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పై అధికారులతో మాట్లాడి క్లియర్ చేస్తానని అక్కడి ఉపాధ్యాయులకు, సిబ్బందికి తెలియచేశారు. కార్యక్రమంలో పట్టణ ప్రజలు, పాఠశాల సిబ్బంది, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తహాశీల్దారు

ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు మరో అవకాశం

- తహాశీల్దార్ రమాదేవి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బికె.పల్లి కాలనీలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలంలో లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకోవాలని తహాశీల్దార్ రమాదేవి స్పష్టం చేశారు. లేని పక్షంలో ఆ ఇంటి పట్టాలను రద్దు చేస్తామని హెచ్చరించారు. శుక్రవారం స్థానిక తహాశీల్దార్ కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2006లో అప్పటి ప్రభుత్వం బికె.పల్లి కాలనీలో పేదలకు 4,842 ఇళ్ల పట్టాలను మంజూరు చేసిందన్నారు. చాలా మంది ఇంటి స్థలాల్లో ఇల్లు నిర్మించుకొని నివాసం ఉన్నారని, సుమారు 800 మంది ఇళ్లు నిర్మించుకోలేదన్నారు. దీనివల్ల కబ్జాలు, ఆక్రమణలు పెరిగిపోయాయని తెలిపారు. ఇప్పటికీ లబ్ధిదారులకు మరో అవకాశం కల్పిస్తున్నామన్నారు. అర్హులైన నిజమైన పేదలు ఉంటే ఒక నెల రోజుల లోపు వారికి కేటాయించిన ఇంటి స్థలంలో గృహాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలా చేయని పక్షంలో వారికి ఇంటి స్థలం అవసరం లేదని భావించి ఇచ్చిన పట్టాలను రద్దు చేస్తామని పేర్కొన్నారు. కొంతమంది ఖాళీ స్థలం కనబడితే ఫోర్జరీ పత్రాలు సృష్టించి, అసలైన లబ్ధి దారులను భయపెట్టి కబ్జా చేసుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నిరుపేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను ఎవరైనా ఆక్రమించినా, వారిని భయభ్రాంతులకు గురిచేసినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రెండు, మూడు రోజుల్లో ఓ కమిటీ ద్వారా బికె.పల్లిలో పర్యటించి ఇంటి స్థలాలను సర్వే చేసి, ఆక్రమణలు ఉంటే తొలగిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో హౌసింగ్ డిఇ దీనదయాల్ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన కార్యక్రమం ద్వారా ఎలక్ట్రీషియన్, టైలరింగ్, సిసి కెమెరా టెక్నీషియన్‌లలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మూడు నెలలపాటు ఉచితంగా నైపుణ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రాకేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ రాయచోటి రోడ్డులో ఉన్న రాజంపేటలోని న్యాక్ జూనియర్ కాలేజీలో జులై 9వ తేదీ లోపల పదవ తరగతి పాసై, 18 ఏళ్లు నుండి 35 ఏళ్ల వయసు కలిగిన అభ్యర్థులు ఆధార్, రేషన్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు, రెండు ఫొటోలు అందజేయాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7989733065, 9032382762 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

ట్రిపుల్‌ఐటి ప్రవేశానికి 53,863 మంది దరఖాస్తు

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్‌జెయుకెటి యూనివర్సిటీ పరిధిలోని 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి నూజివీడు, ఇడుపులపాయి, శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌ల్లో ఆరేళ్ల సమీకృత బిటెక్ ఇంజినీరింగ్ కోర్సులో ప్రవేశాలకు కోసం 53,863 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసు కున్నట్లు ఆర్‌జెయుకెటి అడ్మిషన్ కన్వీనర్ అమ రేంద్రకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25న సాయంత్రం 5 గంట లకు దరఖాస్తులు చేసుకొనేందుకు ఆఖరు గడువు ముగిసిందన్నారు. దరఖాస్తు చేసుకున్న వాటిలో ప్రభుత్వ పాఠశాలల నుంచి 34,154 మంది, ప్రయివేటు పాఠశాలల నుండి 19,671 మంది, ఇతర రాష్ట్రాల నుండి 38 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వారిలో బాలికలు 30,857 మంది, బాలురులు 23,006 మంది న్నారని పేర్కొన్నారు. ప్రత్యేక కేటగిరీలో సైనిక సంతతి విభాగంలో 2,582 మంది, ఎన్‌సిసి విభాగంలో 1830 మంది, క్రీడాల విభాగంలో 1162 మంది, విభిన్న ప్రతిభావంతుల విభాగంలో 332 మంది, భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో 270 మంది దరఖాస్తులు చేసుకున్నారన్నారు. ఎన్‌సిసి, క్రీడలు, విభిన్న ప్రతిభావంతుల కేటగిరిలో దరఖాస్తులు చేసుకున్న వారికి నూజివీడు క్యాంపస్‌లో దరఖాస్తుల పరిశీలన ఉంటుందని తెలిపారు. సైనిక సంతతి (క్యాప్) జులై 1 నుంచి 3వ వరకు సర్టిఫికెట్లు పరిశీలన ఉండగా ఎన్‌సిసి, క్రీడా విద్యార్థులకు 3 నుంచి 5 వరకు, విభిన్న ప్రతిభావంతులకు 3వ తేదీన, భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు 2 నుండి 3వ తేది వరకు



సర్టిఫికెట్లు పరిశీలన ఉంటుందన్నారు. క్యాంపస్‌ల వారిగా ఎంపికైన విద్యార్థుల తుది జాబితా జులై 11న విడుదల చేస్తారని తెలిపారు. ఎంపికైన విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన నూజివీడు, ఇడుపులపాయి(ఆర్కే వ్యాలీ) ప్రాంగణంలో జులై 22, 23 తేదీల్లో ఒంగోలు, ఇడుపులపాయ ప్రాంగణంలో జూలై 24, 25 తేదీల్లో, శ్రీకాకుళం ప్రాంగణంలో 26,27 తేదీల్లో ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునేటప్పుడు ఏదైనా కారణం చేత ప్రత్యేక కేటగిరి సర్టిఫికెట్ పెట్టడం మర్చిపోయిన వారి సంబంధిత సర్టిఫికెట్ తీసుకొని కేటాయించిన ఆయా తేదీలలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం ఆర్‌జెయుకెటి నూజివీడు క్యాంపస్‌కు రావాలని కోరారు. అభ్యర్థి మెరిట్, కేటగిరి ప్రకారం ఆన్‌లైన్‌లో దరఖాస్తులో ఇచ్చిన ప్రాధాన్యత ఆధారంగా క్యాంపస్ కేటాయిస్తారని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను అడ్మిషన్ ప్రక్రియ పూర్తి అయిన తర్వాత క్యాంపస్‌ల మధ్య అభ్యర్థుల అంతర్గత బదిలీ ఉండదని తెలిపారు.

ఆక్రమణలో రూ.వేల కోట్ల విలువైన భూములు : విసికె



సమావేశంలో మాట్లాడుతున్న పిటిఎం శివప్రసాద్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు, పీలేరు, రాయచోటి నియోజకవర్గాల్లో కొన్ని రూ.వేల కోట్ల విలువ చేసే భూములను కొందరు వైసిపి నేతలు దౌర్జన్యంగా ఆక్రమించుకొని ఫెన్సింగ్ వేసి పెట్టుకున్నారని, వాటిపై సమగ్ర విచారణ జరిపి ఆ భూములన్నీ వెనక్కు తీసుకొని అసలైన యజమానులకు వాటిని అప్పగించాలని విసికె పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం.శివప్రసాద్ కొత్త ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో కొందరు వైసిపి నేతలు, కొన్ని సెటిల్మెంట్ ముఠాలు చేసిన భూముల దురాక్రమణపై చర్చించేందుకు శుక్రవారం ఆయన పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో చివరి ఏడాదిలో పేదలను, బలహీనులను లక్ష్యంగా చేసుకొని కొందరు నాయకులు యథేచ్ఛగా భూముల దురాక్రమణకు పాల్పడ్డారని చెప్పారు. కొన్నిచోట్ల భూ వివాదాల్లో కొన్ని సెటిల్మెంట్ ముఠాలు ప్రవేశించి, బలహీనుల భూములను వీళ్లే అమ్మేసి, సొమ్ము చేసుకున్నారని తెలిపారు. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ భూములను, ఇంటి పట్టాలు కింద పేదలకు ఇచ్చిన భూములను కూడా కలిపేసుకొని లే అవుట్‌లు వేసి, క్రయ విక్రయాలు చేస్తున్నారని చెప్పారు. రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, ఇరిగేషన్ శాఖల్లోని కొందరు అధికారులు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల యొక్క సహకారంతోనే ఇవన్నీ జరిగాయని చెప్పారు. మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు, పీలేరు, రాయచోటి నియోజకవర్గాల్లో జరిగిన భూ దురాక్రమణలు, భూ సెటిల్మెంట్లు, అక్రమ లే అవుట్లపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన వారిపైనా, వారికి సహకరించిన ప్రభుత్వ అధికారులపైనా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై సమగ్ర సమాచారంతో త్వరలోనే జిల్లా కలెక్టరుకు వినతిపత్రం సమర్పిస్తామని తెలియజేశారు. సమావేశంలో విసికె పార్టీ నాయకులు సొన్నికంటి రెడ్డెప్ప, పెద్దపాలెం రవిశంకర్, రాయల్ కె.సూరి, బురుజు రెడ్డిప్రసాద్, తెట్టు శ్రీనివాసులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మునిగోపాల్ కృష్ణ

తల్లిదండ్రులను హతమార్చిన కుమారుడిని శిక్షించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆస్తి కోసం కన్న తల్లిదండ్రులను విషం పెట్టి చంపిన కసాయి కొడుకు, కోడలిని కఠినంగా శిక్షించాలని సీనియర్ సిటిజన్ అధ్యక్షులు మునిగోపాల్ కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వీరబల్లి మండలంలోని గుర్రప్పగారిపల్లె పంచాయతీ కొత్తపల్లెకు చెందిన ఉప్పు తాళ్ల సుబ్బన్న (75), ఉప్పువాళ్ల నాగమ్మ (70)లను చిన్న కుమారుడు రమణయ్య, కోడలు కళావతి ఆస్థి కోసం ముష్టి చెక్క, బెల్లం నూరి బలవంతంగా వారికి తినిపించారని తెలిపారు. గమనించిన గ్రామస్తులు, బంధువులు వారిని 108లో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారన్నారు. ఆస్పత్రిలో చేరిన వారు తమ చిన్న కుమారుడు చేసిన నిర్వాహాన్ని పోలీసులకు చెప్పారని పేర్కొన్నారు. ఆ తరువాత చికిత్స పొందుతూ మృతి చెందారని తెలిపారు. మానవ నైతిక విలువలు, కుటుంబ బాంధవ్యాలు కనుమరుగవటం చూస్తుంటే ఆందోళనగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులను హతమార్చిన కుమారుడు, కోడలిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కార్యదర్శి కరుణాకర్, ట్రెజరర్ ఉస్మాన్ సాహెబ్, గౌరవాధ్యక్షులు ముని రత్నమయ్య, ఉపాధ్యక్షులు జగన్మోహన్, శకుంతలమ్మ, కృష్ణమూర్తి, కృష్ణకుమార్ పాల్గొన్నారు.

వైద్య విద్యార్థులతో కేంద్ర ప్రభుత్వం చెలగాటం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

దేశ వ్యాప్తంగా వైద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పరీక్షలో పెద్ద ఎత్తున అక్రమాలు, అవకతవకలు జరిగాయని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నా కేంద్రంలో మోడీ నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటానికే నిర్ణయించుకుందని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు నేతి నాగేశ్వర అన్నారు. శుక్రవారం స్థానిక ఐటిఐ కళాశాల ప్రాంగణంలో ప్లకార్డులతో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని రోజులుగా నీట్ స్కామ్ పై అభ్యర్థులు గగ్గోలు పెట్టడంతో పాటు న్యాయస్థానాలను ఆశ్రయించినా పట్టించుకోని ప్రభుత్వాలు చివరికి సుప్రీం కోర్టు కేంద్రానికి, నీట్‌ను నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)లకు నోటీసులు జారీ చేశాక ఎట్టకేలకు విద్యా శాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పందించి రెండు చోట్ల అక్రమాలు జరిగినట్లు గుర్తించామని అంగీకరించారని తెలిపారు. కుంభకోణంపై విచారణ జరిపిస్తామని కాని, అభ్యర్థులకు ఏవిధమైన న్యాయం చేస్తామనికాని తెలుపకపోవడం దారుణమన్నారు. సుప్రీం, లేదా హైకోర్టు న్యాయమూర్తితో సమగ్ర విచారణ జరిపిస్తేనే కుంభకోణం, దానితో సంబంధం ఉన్న వారి గుట్టు రట్టవుతుందని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా కమిటీ నాయకులు రాంచరణ్, గౌరీశంకర్, రెడ్డెయ్య, నరేష్, వెంకట్, శివ, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మానవత సంస్థ సభ్యులు

ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధనకు కృషి చేసిన ఉపాధ్యాయులను మానవత సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సి.ఐ.సూర్యనారాయణ, హెచ్‌ఎం.భాస్కర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తమ ఫలితాల సాధనలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయుల పాత్ర సమానంగా ఉంటుందని అన్నారు. ఇదే స్ఫూర్తితో ఉపాధ్యాయులు పనిచేసి భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులను సన్మానించిన మానవత సంస్థ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో మానవత సంస్థ సభ్యులు ఎన్.కృష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి, ఆదిత్య ప్రసాద్, వెంకటరెడ్డి, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

డయేరియా రోగుల చికిత్స కోసం చర్యలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ ఆస్పత్రిలో డయేరియా వ్యాధిగ్రస్తుల కోసం ప్రత్యేక చికిత్సలు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు మెడికల్ ఆఫీసర్ వెంకటరామయ్య తెలిపారు. శనివారం పిహెచ్‌సి ఆస్పత్రిలో ప్రత్యేక బెడ్లు ఏర్పాటు చేశారు. రోజురోజుకూ డయేరియా కేసులు అధికమవడంతో ఈ చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామాలలో ఎవరైనా డయేరియా బారిన పడిన వెంటనే సిహెచ్‌సికి వచ్చి ప్రత్యేక వైద్య సేవలు పొందాలని సూచించారు.

సిఎం, డిప్యూటీ సిఎం చిత్రపటాలు అందజేత

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని రెడ్డిపల్లె సచివాలయంలో శుక్రవారం మాజీ సర్పంచ్ రొంపిచర్ల మురళి ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ చిత్ర పటాలను అందజేశారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ సిఎంతో పాటు డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌కు కూడా సముచిత స్థానం కల్పించాలని ఉద్దేశంతోనే సిఎం ఫోటో పక్కన డిప్యూటీ సీఎం ఫోటో పెట్టడం జరిగిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సిఎం, డిప్యూటీ సిఎం ఫొటోలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చంద్రబాబు తీసుకున్న నిర్ణయం పట్ల జనసేన నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

సిఎం, డిప్యూటీ సిఎం ఫొటోలను తగిలిస్తున్న మురళి

క్రైం కార్నర్

హత్యపై వివరాలను వెల్లడిస్తున్న డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి

కొలిక్కి వస్తున్న మహిళ హత్య కేసు

నిందితుడి కోసం ముమ్మర గాలింపు

ద్విచక్ర వాహనం లభ్యం : డిఎస్‌పి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మహిళను హత్యచేసి అడ్డుకోబోయిన యువకుడిని అతిదారుణంగా గాయపరచిన సంఘటన మండలంలో సంచలనం కలిగించింది. రెడ్డివారిపల్లి పంచాయతీ దివిటివారిపల్లె సమీపంలోని బాలే రమణ కుమారుడు బాలే రామాంజులు(27)చెందిన వ్యవసాయ పొలం వద్ద ఉన్న పూరి పాకలో గురువారం రాత్రి మహిళ హత్య జరగగా, స్థానికుడైన రామాంజులు ఇది గమనించి అడ్డుకోపోగా హంతకుడు అతనిని సైతం తీవ్రంగా గాయపరిచిన సంఘటన జరిగింది. ఈ ఘటనపై మదనపల్లె డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి మదనపల్లి డివిజన్ సిఐ, ఎస్‌ఐలతో కలసి దర్యాప్తు చర్యలను ముమ్మరం చేశారు. శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటల వరకు పోలీసులు సంఘటన స్థలంలోనే ఆధారాల కోసం గాలింపు చర్యలు చేపట్టి, హంతకుడు విడిచి వెళ్లిన ఆధారాలను సేకరించారు. శుక్రవారం వేలిముద్రల నిపుణులను పిలిపించి వేలిముద్రలను సేకరించారు. డాగ్ స్క్వాడ్ బృందంతో హంతకుని కోసం గాలించగా సంఘటనా స్థలం నుంచి రాచవేటివారిపల్లె పంచాయతీ గొల్లపల్లె మీదుగా, ఆచార్లపల్లె వైపు కొంత దూరం వెళ్లి కుక్క అక్కడ ఆగిపోవడం జరిగిందన్నారు. హంతకుడు ఉపయోగించిన ద్విచక్ర వాహనం గొల్లపల్లి వద్ద లభ్యమైందని, దీని ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నామని డిఎస్‌పి చెప్పారు. మృతురాలు చిత్తూరు జిల్లా, పెనుమూరు మండలం కార్తికేయపురంకు చెందిన రంగయ్య, సాలమ్మ దంపతుల కుమార్తె పి.భారతి (24)గా గుర్తించినట్లు తెలిపారు. ఈమెకు ఇదివరకే వివాహమైందని, పలమనేరు ప్రాంతానికి చెందిన మొదటి భర్తను విడిచి నెల్లూరు జిల్లా, కొవ్వూరు కు చెందిన మరో వ్యక్తిని పెళ్లి చేసుకొని జీవిస్తున్నాదని అన్నారు. మృతురాలికి చిన్న పిల్లలు కుమారుడు, కుమార్తె ఉన్నారని తెలిపారు. మృతురాలు పి.భారతి తల్లి సాలమ్మ ఇప్పటికే ఫిర్యాదు చేశారన్నారు. నిందితుల కోసం పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నారని, కేసు ఇప్పటికే దాదాపుగా కొలిక్కి వచ్చిందని త్వరలోనే హంతకుడిని పట్టుకుంటామని తెలిఆపరు. దర్యాప్తు బృందంలో సిఐలు సద్గురుడు, యువరాజు, వల్లిబాషా, రామసముద్రం ఎస్ఐ చంద్రశేఖర్, ముదివేడు ఎస్ఐ మల్లికార్జున, ఎఎస్ఐ జిలాని, నిమ్మనపల్లె పోలీసులు పాల్గొన్నారు.

అదుపుతప్పి డివైడర్ మధ్యలో ఇరుక్కున్న కంటైనర్

- తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట పట్టణంలోని జాతీయ రహదారిలో శుక్రవారం ఎన్‌టిఆర్ కూడలి వద్ద ఒక కంటైనర్ అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లింది. డివైడర్ మధ్యలో కంటైనర్ ఇరుక్కుపోవడంతో ఇరువైపుల వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఆర్ అండ్ బి అధికారులు అక్కడికి చేరుకుని డివైడర్‌ను పగలగొట్టి కంటైనర్‌ను బయటికి తీశారు. ఆ డివైడర్‌పై రోజువారీ కూలీలు, బిచ్చగాళ్లు కూర్చుని తరచూ తేనీరు తాగుతూ ఉంటారు. కానీ కంటైనర్ ఢీకొన్న సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు. ఇదే ప్రాంతంలో పలుమార్లు ఇలాంటి సంఘటనలు జరుగుతున్నప్పటికీ అధికారులు సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడం, జాతీయ రహదారిలో అతి చిన్న డివైడర్‌ను ఏర్పాటు చేయడం పట్ల ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి : 'నల్లారి'

ప్రజాశక్తి-కలకడ

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు మండల స్థాయి అధికారులు సమన్వయంగా పనిచేసే మండలాన్ని అభివృద్ధి మార్గంలో పయనింపచేయాలని సూచించారు. శాసనసభ్యులుగా ఎన్నికైన తర్వాత మొదటిసారి మండలానికి వచ్చిన కిషోర్‌కుమార్‌రెడ్డికి మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఆవరణంలో మండల స్థాయి అధికారులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అధికారులు సమస్యలపై దృష్టి సారించి వాటిని పరిష్కరించి ప్రజలకు ఇబ్బంది లేకుండా వారికి సహకరించాలని ఆదేశించారు. గత ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాలను నేటి ప్రభుత్వం చేయదని ఇందుకోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎల్లవేళలా కష్టపడి పనిచేస్తారని అన్నారు. ప్రజల సమస్యలపై దృష్టి సారించి వారికి ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యల పట్ల నేను సానుకూలంగా స్పందించి సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దడం ఖాయమని తెలిపారు. వైసిపి ప్రభుత్వం చేసిన దుశ్చర్యలను తాము చేయబోమని కక్ష సాధింపులకు పాల్పడం తమ నైజం కాదని అన్నారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా కూటమి అభ్యర్థులను గెలిపించి అధికారం అందించిన ఓటర్లకు ప్రజలకు ఎల్లవేళలా రుణపడి ఉంటానని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలలో కూడా టిడిపి విజయకేతనం ఎగరవేయాలని తెలియజేశారు. జగన్మోహన్ రెడ్డి మోసపూరిత మాటలతో మైనార్టీ సోదరులను మభ్యపెడుతూ వారిని మోసం చేసిన విషయాలను ప్రతి ముస్లిం సోదరులు గుర్తుపెట్టుకోవాలని సూచించారు. ప్రతి మండలం నుంచి సమస్యలను సమన్వయంగా పరిష్కరించుకోవాలని సూచించారు. మండలంలో గ్రూపు రాజకీయాలు చేస్తే భవిష్యత్తులో మనుగడ ఉండదని గుర్తు చేశారు. ప్రతి ఒక్క కార్యకర్తకు అందుబాటులో ఉండే వారి సమస్యల పట్ల దృష్టి సారించి పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని కార్యకర్తలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్య ప్రకాష్, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లారపు రవి ప్రకాష్ నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ నాయుడు, నాయకులు మద్దిపట్ల వెంకటరమణ నాయుడు, దగ్గుపాటి వెంకటేశ్వరరావు, జనార్ధన్ నాయుడు ఈశ్వరయ్య, వెంకటరమణ(పెద్దోడు) సర్పంచ్ విశ్వనాథ నాయుడు, వెంకటరమణ, కాంతారావు, బరకం శ్రీనివాసరెడ్డి, బివి స్వామి ,త్యాగరాజు, వై జిలానిబాషా, నాయకులు, కార్యకర్తలు ఇర్ఫాన్ అహ్మద్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి

జాతీయ స్థాయిలో కెవికెకు 10వ స్థానం

ఉత్తమ అవార్డును అందుకుంటున్న కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ పాండురంగ

ప్రజాశక్తి-కలికిరి

భారత జాతీయ సాంకేతిక పరిశోధన మండలి ఆధ్వర్యంలో రాజమండ్రిలోని కేంద్రీయ పొగాకు పరిశోధనా స్థానంలో కృషి విజ్ఞాన కేంద్రాల వార్షిక జోనల్ సదస్సు ఈ నెల 25 నుంచి 27 వరకు నిర్వహించడం జరిగిందని కెవికె కదిరి కో-ఆర్డినేటర్ డాక్టర్ పాండురంగ తెలిపారు. ఇందులో ఎపి, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి పరిధిలో గల 72 కృషి విజ్ఞాన కేంద్రాల సమన్వయ కర్తలు పాల్గొన్నారని అన్నారు. గత సంవత్సరం 2023-2024 లో నిర్వహించిన ప్రథమ శ్రేణి, క్షేత్ర పరిశీలన, శిక్షణ, విస్తరణ కార్యక్రమాలను ఆధారం చేసుకుని బహుమతులు, ప్రశంసా పత్రాలు జారీ చేశారని అన్నారు. క్షేత్ర పరిశీలన ద్వారా నూతన వేరుశనగ టిసిజిఎస్-1694 (విశిష్ట) రకం ద్వారా బెట్ట పరిస్థితులలోనూ రైతు అధిక దిగుబడి సాధించడం, జిల్లాలో మామిడి రైతులు ఫ్రూట్ కవర్లు వాడకం ద్వారా నాణ్యమైన మామిడి కాయలు పొందడం పై విరివిగా అవగాహన కల్పించినందుకు కలికిరి కెవికె తరుపున హైదరాబాదు అటరీ జోన్-ఎక్స్ డైరెక్టర్ ఎన్.మీరాతో అవార్డును అందుకున్నట్లు తెలిపారు. ఆటారీ జోన్-ఎక్స్ పరిధిలోని 72 కృషి విజ్ఞాన కేంద్రాలలో కలికిరి కెవికెకు 10వ స్థానం లభించడం సంతోషకరమని అన్నారు. సంస్థలో పనిచేయుచున్న వివిధ శాస్త్రవేత్తలకు, ఇతర సిబ్బందికి వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో పాల్గొని గ్రామీణ ప్రజలకు వ్యవసాయంలో వివిధ పథకాల గురించి వివరించినందుకు ప్రశంసా పత్రాలు అందించారని అన్నారు. సదస్సులో మామిడి అంటు మొక్కల తయారీ, వివిధ పంటల్లో అడవి పందుల యాజమాన్యం పైన ప్రచురణలు విడుదల చేశారని అన్నారు. కెవికెలోని శాస్త్రవేత్తలు డాక్టర్ కె.మాధురి, ఎస్.సోమ శేఖర్‌బాబు, డాక్టర్ వై.పీరు సాహెబ్, డాక్టర్ ఎ.శ్రీనివాసులు, బి.రమణ, భోదనేతర సిబ్బంది కృషి వలన ఈ అవార్డులు వచ్చాయని తెలిపారు.

అతిసార నియంత్రణకు చర్యలు : ఎంపిడిఒ

ప్రజాశక్తి-కంభంవారిపల్లి

మండలంలో సీజనల్ వ్యాధులతో పాటు అతిసార నియంత్రణకు చర్యలు చేపట్టామని ఎంపిడిఒ యాదవేంద్ర పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో అతిసార, డెంగీ, విష జ్వరాలపై మండలస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లేళ్ళమంద వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ జులై 1న 'స్టాప్ డయేరియా క్యాం పెయిన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలతో వారి పరిధిలోని ఐదేళ్ల లోపు పిల్లలు ఉన్న గృహాలను సందర్శించి వారికి ఒఆర్‌ఎస్, జింక్ మాత్రలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. గ్రామాలలో అతిసార కేసులు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తామన్నారు. పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యశాఖ, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, పాఠశాల విద్య శాఖలు సమన్వయంతో పనిచేసినప్పుడే నియంత్రణ సాధ్య మవుతుందని చెప్పారు. ఆరోగ్య, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలలో ఒఆర్‌ఎస్, జింక్ మాత్రలు అందు బాటులో ఉంచాలని సూచించారు.ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్యదర్శులు సురక్షిత తాగు నీటిసరఫరా, గ్రామ పారిశుధ్యం, ఈగల నిర్మూలనపై చర్యలు చేప ట్టాలని ఆదేశించారు. సమావేశంలో గర్నిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి డాక్టర్ రేష్మ, మండల విద్యాశాఖాధికారి రెడ్డిభాషా, హెల్త్ సూపర్వైజర్ పురుషోత్తం, అంగన్వాడీ సూపర్వైజర్ అన్నపూర్ణ, పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

- టిడిపి ఇన్‌ఛార్జి 'ముక్కా', ఎమ్మెల్యే శ్రీధర్

రైల్వేకోడూరు: బస్టాండ్ పరిసరాలను శుభ్రం చేయిస్తున్న ముక్కా, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైల్వే కోడూరు ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధి సౌకర్యాలపై టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానంద రెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ దృష్టి సారించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా శిథిలావస్థలో ఉన్న బస్టాండ్ రూపు రేఖలు మార్చడానికి కృషి చేస్తున్నామని అన్నారు. ఇటీవల రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డితో చర్చించినట్లు తెలిపారు. కోడూరు బస్టాండ్ సర్వే ప్రకారం సరిహద్దులు చూసి బస్టాండ్ వద్ద ఉన్న కంప చెట్లను తొలగించేందుకు చర్యలు ప్రారంభించామని పేర్కొన్నారు. బస్టాండ్ పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అన్ని సౌకర్యాలను కలిగిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

ప్రజాశక్తి-పుల్లంపేట : ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో శుక్రవారం ఎన్‌టిఆర్ సుజల సురక్షిత మంచినీటి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి పంచాయతీకి మంచినీటి కేంద్రాలను ఏర్పాటు చేయడమే మొదటి కర్తవ్యమని అన్నారు. నియోజకవర్గంలో ఎక్కడైనా పైప్‌లైన్ సరిగ్గా లేకపోయినా, తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నా తమ దృష్టికి తీసుకుని వస్తే వెంటనే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ప్రతి పంచా యతీకి ఒక వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం పట్ల స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రాధాన్యత

ప్రజాశక్తి-రామాపురం

ప్రభుత్వం విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని టిడిపి నాయకులు నీలకంఠరావుపేట ఉప సర్పంచ్ మహబూబ్ పేర్కొన్నారు. మండలంలోని నీలకంఠరావుపేట మండల ప్రాథమిక పాఠశాల తెలుగు, ఉర్దూ మీడియం చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం గోడలకు రంగులు వేయడం తప్పా విద్యాభివృద్ధికి ఎటువంటి ప్రాధాన్యత ఇవ్వలేదని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు టిడిపి మైనార్టీ నాయకులు నీయాజ్ సయ్యద్, ముహీద్, షఫీ, రియాజ్ ఆసిఫ్ పాల్గొన్నారు.

'ముక్కా', ఎమ్మెల్యేను కలిసిన ఎపి ఎన్‌జిఒలు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా నాయకులు శుక్రవారం రైల్వే కోడూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు, సెక్రటరీ డి.రవికుమార్, వైస్ ప్రెసిడెంట్ టి శ్రీనివాసులు, కోశాధికారి నిత్య పూజయ్య, సిటీ వైస్ ప్రెసిడెంట్ డి.పద్మారావు, రైల్వే కోడూరు తాలూకా ప్రెసిడెంట్ పి.ఓబులేసు, కోశాధికారి అస్లాం పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి-గాలివీడు

దూర ప్రాంతాల నుంచి నూలివీడు జడ్‌పి హైస్కూల్‌కు వచ్చే విద్యార్థు లకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ శుక్రవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని పూర్వ విద్యార్థులు వినతి పత్రం సమర్పిం చారు. మండల పరిధిలోనిని తలముడిపి, కొర్లకుంట, ఈడిగపల్లి, బోరేడుగారిపల్లి, పందికుంట వంటిదూర ప్రాంతాల నుంచి నూలివీడు హైస్కూల్ కి వచ్చే విద్యా ర్థులకు బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సమయానికి పాఠశాలకు వెళ్లలేక చదువుకు దూరమయ్యే పరిస్థితులు ఉన్నాయని మంత్రి దృష్టికి తీసుకవచ్చారు. నూలువీడు గ్రామం కొండేటిగారిపల్లిలో ఉన్న జడ్పీ హైస్కూల్ కు 14 కిలోమీటర్ల దూరంలో ఉన్న విద్యా ర్థులు 60 మంది దాకా ఉన్నారని వారు బస్సు సౌకర్యం లేక ఆటోలలో సమయానికి స్కూల్‌కు చేరుకోలేక పోతున్నారని అన్నారు. విద్యార్థుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని పాఠశాల సమయ వేళల్లో బస్సు రావడానికి పాఠశాల అయిపోయిన తర్వాత స్కూల్ బస్సు రావడానికి అనుకూలమైన బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. మంత్రిని కలసిన వారిలో పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ప్రెసిడెంట్ కరక్కోటి చంద్రశేఖర్, వైస్ ప్రెసిడెంట్ వేల్పుల జనార్ధన, సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి 'మండిపల్లి'కి అభినందనలు తెలిపిన గోల్డెన్ వ్యాలీ విద్యా సంస్థల అధినేత

మదనపల్లి : రవాణా, క్రీడలు, యువజన సర్వీసుల శాఖా మాత్యులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని గోల్డెన్ వ్యాలీ విద్యాసంస్థ కరస్పాండెంట్ ఎన్.వి.రమణారెడ్డి శుక్రవారం రాయచోటిలోని మంత్రి కార్యాలయంలో కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20ఏళ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత మొట్టమొదటిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికై మంత్రివర్గంలో సముచిత స్థానం దక్కించుకోవడంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి చూపిన ప్రతిభ రాష్ట్రంలో ప్రతి ఒక్క యువకుడికి ఆదర్శం కావాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు ఆరేటి వాసు పాల్గొన్నారు.

మంత్రి రాంప్రసాద్‌రెడ్డితో ఎం.వి.రమణారెడ్డి

బియ్యం బస్తాల తూకాలను పరిశీలిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

నిత్యావసర సరుకుల సరఫరాలో నిర్లక్ష్యం వద్దు : జెసి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లె

నిత్యవసర సరుకులను చౌక దుకాణాలకు సరఫరా చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే అధికారులను ఉపేక్షించేది లేదని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పౌర సరఫరాల గోదామును శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదాము నిర్వహణలో అవకతవకలకు పాల్పడిన, ఉదాసీనంగా వ్యవహరించిన చర్యలు తప్పవని గోదాము అధికారి మల్లికార్జున బాబును హెచ్చరించారు. గోదాములోని స్టాక్ రిజిస్టరు, సరుకుల దిగుమతి పత్రాలను పరిశీలించారు. చౌక దుకాణాలకు సకాలంలో సరుకులను రవాణా చేయాలని అన్నారు.రేషన్ బియ్యం తమకు ఇంకా పంపలేదని డీలర్లు ఫిర్యాదు చేయకుండా సకాలంలో వారికి పంపించాలని గోదాము అధికారికి సూచించారు.చౌక దుకాణాలకు పంపించే బియ్యాన్ని తప్పనిసరిగా తూకం వేయాలని, తూకం వేయకుండా పంపిస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం తూకాలు వేసే పరికరాన్ని పరిశీలించారు. కార్యక్రమంలోతహశీల్దార్ కుమారస్వామి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటి ఉస్మాన్ సాహెబ్, ఆర్ఐ సమ్మత్ ఖాన్ మరియు గోదాము సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగ సభ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2023-24 సంవత్సరంలో వివిధ శాఖల్లో చేపట్టిన పనుల పై సామాజిక తనికి బహిరంగసభ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ఎపిఒ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని పది గ్రామ పంచాయతీలలో 1-4-2023 నుంచి 31-3-2024 వరకు జరిగిన పనులపై సామాజిక తనిఖీ బృందం 18వ విడత సామాజిక తనిఖీ నిర్వహించి, నిర్దేశించిన తేదీలలో అన్ని గ్రామ పంచాయ తీలలో గ్రామ సభలను నిర్వహించినట్లు తెలిపారు. సామాజిక తనిఖీలో గుర్తించిన అంశాలపై సంబంధిత అధికారులతో ఉదయం 10 గంటలకు ఉపాధి హామీ పథక భవనం, స్త్రీ శక్తి భవనం ఆవరణంలో సామాజిక తనిఖీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మం డలంలోని ప్రజాప్రతినిధులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొనాలని తెలిపారు.

మండల వ్యాప్తంగా 6,239 పింఛన్లు

ప్రజాశక్తి-గాలివీడు :మండలంంలో 6,239మంది పింఛన్ దారులు ఉన్నారని,జూన్ 1న సోమవారం ఎన్‌టిఆర్ భరోసా పింఛన్‌ను పింఛను దారుల ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేయాలని ఎంపిడిఒ శ్రీనివాసులు పేర్కొన్నారు. 16 సచివాలయంలో ఉన్న సచివాలయ ఉద్యోగులతో ఆయన సమావేశం ఏర్పాటు చేసి పింఛన్ డబ్బులు కూడా శుక్రవారం డ్రా చేయించి 6239 పింఛన్ల గాను నాలుగు కోట్ల 36 లక్షల 73వేల నగదును పంచాయతీ సెక్రెటరీ, సచివాలయం కార్యదర్శి వద్ద నగదు నిలువ ఉందని తెలిపారు. ఈ నగదును సోమవారం పింఛన్ దారుల గృహాల వద్దకు వెళ్లి ఒక్కొక్కరికి రూ.7వేలు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఎక్కువమంది పింఛన్‌దారులు గాలివీడు 1450 మంది, ఆరవీడులో 735, గోరాన్ చెరువులో 703, నూలివీడులో 724 మంది ఉన్నారని తెలిపారు. సచివాలయం ఉద్యోగులు 6 మంది నుంచి 15 మంది వరకు పింఛన్ దారుల జాబితాను బట్టి ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

'ఉపాధి' పనుల్లో అవకతవకలపై విచారణ

ప్రజాశక్తి-చిట్వేలి

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎపిడి ప్రతాప్

మండల పరిధిలోని సి.కందులవారిపల్లి పంచాయతీలో గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలు జరిగాయని గ్రామస్తుల ఫిర్యాదు మేరకు శుక్రవారం ఎపిడి ప్రతాప్, సి.కందులవారిపల్లి గ్రామంలో ఎపిఒ చంద్ర కళ, ఉపాధి సిబ్బంది, గ్రామస్తుల సమక్షంలో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. గ్రామస్తులు మాట్లాడుతూ స్థానికంగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ అనేక అవకత వకలకు పాల్పడినట్లు, ఇష్టానుసారంగా వ్యవహరించినట్లు వారు ఎపిడి దృష్టికి తీసుకవచ్చారు. ఎన్నికల నిబంధనలను విస్మరించి ప్రచారంలో పాల్గొన్నట్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని పరిశీలించి పూర్తిస్థాయి నివేదిక ఉన్నతా ధికారికి అందిస్తామని ఆయన హామీనిచ్చారు. గ్రామంలో ఉపాధిహామీ పనులకు వెళ్లే కూలీలకు ఎపిఒ చంద్రకళ పర్యవేక్షణలో జరుగుతుందన్నారు. అనంతరం హార్టికల్చర్‌లో ఆసక్తి కలిగిన రైతులు ఐదు ఎకరాల లోపు పొలం గలిగిన వారు దరఖాస్తు చేసుకున్న మూడు సంవత్సరాల వరకు పంటలను పెంచే బాధ్యత పూర్తిగా ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతుందని అన్నారు. ఆసక్తి కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండలంలో ఏదో ఒక గ్రామంలో ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అవకతవకల పట్ల మండలంలో చర్చనీయాంశంగా మారింది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ ఉపాధి కూలీల విషయంలో చర్యలు తీసుకోవాలని పలువురు కోరుకుంటున్నారు. కార్య క్రమంలో సి.కందు లవారిపల్లి గ్రామ సర్పంచ్ బాలు, రామానుజుల నాయుడు, కాకర్ల సుబ్బరా యుడు, కాకర్ల నాగార్జున, వెంకటేశ్వర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి
(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ